# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

బాపట్ల జిల్లా వార్తలు

శుక్రవారం 5 జనవరి 2024






# వైసీపీలో టికెట్లాట

వైసీపీలో టికెట్లాట.. నియోజకవర్గాల్లో ఓ వెలుగు వెలిగిన నేతల్లోనే అయోమయం.. గందరగోళం నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాజకీయ బదిలీ వైరాగ్యం వ్యక్తపరచడం వైసీపీలోని గందరగోళ స్థితికి అద్దం పడుతోంది. సీటు విషయంలో మార్పు ఖాయమనే సంకేతాలను వైసీపీ ఇస్తుండడంతో చాలాచోట్ల వైసీపీ నేతలు కాడి వదిలేశారు. ఎటూ తమ సీటుకు భరోసా లేదు. కనుక ప్రకటించినప్పుడు చూసుకుందామనే ధోరణిలో కొందరున్నారు. తొలి జాబితాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎనిమిది స్థానాల్లో మార్పు చోటుచేసుకోగా రెండో జాబితాలో ఒకరిని మార్చారు. విడుదల చేసిన జాబితాలో తమ నియోజకవర్గం పేరు లేనందుకు గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల నేతలు ఆనందపడడం వైసీపీలో ఉన్న విచిత్ర పరిస్థితికి అద్దం పడుతోంది.

- అధికార పార్టీలో విచిత్ర పరిస్థితి
- ఎమ్మెల్యేల్లో రాజకీయ బదిలీ వైరాగ్యం
- స్థానికంగా కాడి వదిలేసిన నాయకులు
- రెండో గండం గడిచిందని నేతల ఆనందం

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమీపిస్తున్న వేళ పాలకపార్టీ ఇన్‌చార్జుల జాబితాను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 2న 27 మందితో వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. సహజంగా జాబితాలో తమను ఖరారు చేస్తూ పేరుండాలనే ఆశతో నేతలు ఉంటారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు తూర్పు మాత్రమే ఉండగా అక్కడ మార్పు అందరూ ఊహించిందే కావడంతో పెద్దగా ఎవరూ ఆశ్చర్యం వ్యక్తం కాలేదు. కాకపోతే మిగిలిన నియోజకవర్గాల్లో ఉన్న పాలక పార్టీ నేతలు మాత్రం ఈ జాబితాలో తాము ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గం పేరు కనబడనందుకు ఆనందపడుతున్నారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను ఖరారు చేస్తూ జాబితాలు విడుదల చేస్తుంటే తమ నియోజకవర్గం పేరు లేనందుకు ప్రస్తుతానికి గండం గడిచిందని నేతలు వ్యాఖ్యానించడం వైసీపీలో ఉన్న గందరగోళ స్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికే సమన్వయకర్తలను ఖరారు చేసిన నియోజకవర్గాలను మినహాయిస్తే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా మార్పులు ఖాయమనే అంచనాలకు సదరు నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి తమను వేరే నియోజకవర్గానికి మార్చడమన్నా జరగాలి లేదంటే తమకు మొండిచేయి చూపెట్టి వేరే వారిని ఆయా నియోజకవర్గాల్లో నియమించడమం అధికార పార్టీ విధానంగా ఉంది. దీంతో తమ నియోజకవర్గం కానీ, తమ పేరు కానీ జాబితాలో ప్రస్తుతానికి లేకపోవడమే మేలని వైసీపీ నేతలు భావిస్తుండడం అయోమయ స్థితికి అద్దం పడుతోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయని, పరిస్థితులను బట్టి అప్పుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చనేది నేతల ఆలోచనగా ఉంది. అప్పటి వరకు తమ విషయంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉండడమే మంచిదనే అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

**తొలి జాబితాలో పెద్ద సంఖ్యలో...**

గతేడాది డిసెంబరు 11న 11 మంది సమన్వయకర్తలతో వైసీపీ తొలి జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలో అనూహ్యంగా గుంటూరు జిల్లాకు సంబంధించి నాలుగు స్థానాలకు సమన్వయకర్తలను ప్రకటించగా, పల్నాడు జిల్లాలో ఒకటి, బాపట్ల జిల్లాలో మూడు స్థానాలకు సమన్వయకర్తలను ప్రకటించారు. తొలిజాబితాలో ప్రకటించిన 11 స్థానాల్లో 8 గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని రెండో జాబితాలో కూడా ఈ మూడు జిల్లాల నుంచి భారీ మార్పులుండే అవకాశం ఉందని వైసీపీ నేతలు భావించారు. రెండో జాబితా విడుదలకు ముందునుంచే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మరో నాలుగు స్థానాలకు సంబంధించి కొత్త ఇన్‌చార్జిలను ప్రకటిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. బాపట్ల జిల్లాలో పర్చూరు స్థానంలో మార్పు ఖాయమనే అభిప్రాయం వైసీపీ వర్గాల్లోనే వ్యక్తమైంది. అయితే రెండో జాబితాలో ఒక్క గుంటూరు తూర్పు తప్ప వేరే వాటిని ప్రకటించకపోవడంతో ప్రస్తుతానికి గండం తప్పిందని నేతలు ఊపిరి పీల్చుకున్నారు.

**తొలి జాబితా మంటలు ఇంకా చల్లారలేదు...**

వైసీపీ తొలి జాబితా అసంతృప్తి జ్వాలలు ఇంకా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రగులుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రేపల్లెలో ఎంపీ మోపిదేవిని తప్పించడంపై మత్స్యకార సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇంకా వైసీపీ పెద్దలను కలుస్తూనే ఉన్నారు. తాజాగా బుధవారం కూడా పార్టీ పెద్దలను కలిసి రేపల్లె సీటు ఎంపీ మోపిదేవికే కేటాయించాలని వైసీపీ కీలక నేతల దగ్గర మత్స్యకార సంఘ రాష్ట్ర ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇక అద్దంకిలో అయితే ఇప్పటికీ మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య సీటు తనదేననే ధీమా వ్యక్తం చేస్తూ విడిగా కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఇక గుంటూరు పశ్చిమలో తాజాగా రజిని కార్యాలయంపై రాళ్ల గొడవ వారిలో ఉండే గ్రూపు తగాదాల వల్లే జరిగిందని టీడీపీ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడ కూడా కొత్త ఇన్‌చార్జిని స్వాగతించే పరిస్థితులు లేకపోగా విభేదాలు రోజురోజుకు ముదురుతున్న సూచనలు కనబడుతున్నాయి. వేమూరు విషయంలో అయితే వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు నూతన ఇన్‌చార్జి అశోక్‌బాబుకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఇలా వైసీపీ ప్రకటించిన అన్ని స్థానాల్లో ఏదో ఒక రూపంలో అసమ్మతి భగ్గుమంటూనే ఉంది.

**ఇదో వింత పరిస్థితి...**

ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు సీటు ఉందో లేదో చెప్పి వేరే వారిని ఆయా స్థానాల్లో ప్రకటించడం దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న వైఖరి. కానీ ప్రస్తుత పాలకపార్టీలో నడుస్తున్న ట్రెండ్ వేరు. రాజకీయ బదిలీలు చేపడుతుండడంపై నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి తాము పాతుకుపోయిన నియోజకవర్గాలను వేరే వారికి కేటాయిస్తూ, తమను కొత్త చోటకు పంపడం ఏమిటో తెలియక తలలు బాదుకుంటున్నారు. దీనిబదులు తమకు సీటు నిరాకరించడమే మేలని అలా చేయకుండా వేరే చోటకు పంపించి పొమ్మనకుండా పొగబెట్టే దుర్మార్గ వ్యూహం ఏమన్నా అధికార పార్టీ అమలు చేస్తుందేమోనన్న అభిప్రాయాన్ని సొంత పార్టీ నేతలే వ్యక్తం చేయడం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ వైసీపీలో జరుగుతున్న టికెట్లాట వల్ల జాబితా విడుదల చేసిన ప్రతిసారి గండం గడిచిందని అనుకునే పరిస్థితి సదరు నేతలకు దాపురించిందని ప్రజలు అనుకుంటున్నారు.



# పింఛన్లు.. 16.59 శాతమే

- నామమాత్రంగా కూడా కాని పంపిణీ
- అవ్వా.. తాతలకు పంపిణీలో తీవ్రజాప్యం
- వలంటీర్ల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- పింఛన్ కోసం లక్షల మంది ఎదురుచూపు
- 5.57 శాతం పంపిణీతో చిట్టచివరన పల్నాడు జిల్లా

నరసరావుపేట, జనవరి 4: ప్రతీ నెల ఒకటో తేదీ.. ఆ రోజు ఆదివారమైనా.. మరేదైనా సెలవు దినమైనా.. పండుగైనా కూడా సూర్యోదయానికి ముందుగానే చిక్కటి చిరునవ్వుతో వలంటీరు వచ్చి గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్ ఇస్తారు.. వారి మోములో నవ్వును చూస్తారు.. అని ముఖ్యమంత్రి జగన్ వేదికలపై చెప్తున్నారు.. అదే రీతిలో ప్రచారం కూడా చేసుకుంటున్నారు. అయితే జనవరి నెలలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న సామాజిక పింఛన్ లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది. ఈ నెలలో నాలుగు రోజులు గడిచినా పలువురికి పింఛన్ అందలేదు. ఇప్పటి వరకు నామమాత్రంగా కూడా పింఛన్ల పంపిణీ జరగలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో గురువారం సాయంత్రం 5 గంటల వరకు 16.59 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. ఉద్యోగులు, ప్రభుత్వ పింఛన్‌దారులకు లాగానే సామాజిక పింఛన్ పంపిణీలో జాప్యం జరుగుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడో రూ.3,000కు పెంచాల్సిన పింఛన్‌ను ఎట్టకేలకు ఎన్నికలకు మూడు నెలల ముందుగా జనవరి నెలలో ప్రభుత్వం పెంచింది. పెరిగిన మొత్తంతో ఈ నెలలో పింఛన్ తీసుకోవచ్చని నాలుగు రోజులుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. అయితే తమకు ఎప్పటికి పింఛన్ వస్తుందనే విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్‌పైనే ఆధారపడి అనేక మంది వృద్ధులు, వితంతువులు జీవనం సాగిస్తున్నారు. మందులు ఇతర ఖర్చులకు ప్రభుత్వం అందజేసే పింఛన్‌ను వినియోగించుకుంటూ ఉంటారు. అయితే నాలుగు రోజులైనా పింఛన్ అందకపోవడం.. ఎప్పుడు అందుతుందో తెలియక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**సమయం పట్టవచ్చు..**

వృద్ధాప్య వివిధ రకాల పింఛన్లు పూర్తి స్థాయిలో పంపిణీకి ఇంకా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. మూడు జిల్లాలో 7,86,022 లబ్ధిదారులకు పింఛన్ అందించాలి. అయితే కేవలం 1,30,478 లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పింఛన్ నగదు వలంటీర్లకు అందలేదు. వారి చేతికి ఆ నగదు అందితేనే లబ్ధిదారులకు పంపిణీ చేసే పరిస్థితి. పింఛన్ కోసం వలంటీర్ల చుట్టూ వృద్ధులు ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ పంపిణీలో పల్నాడు జిల్లా చిట్ట చివరిలో ఉంది. ఈ జిల్లాలో 5.57 శాతమే పింఛన్‌లు పంపిణీ చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుంది. బాపట్ల జిల్లాలో 23.38 శాతం, గుంటూరు జిల్లాలో 22.42 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేశారు.

**పింఛన్ పంపిణీ వివరాలు**

| జిల్లా | లబ్ధిదారులు | స్వీకరణ | శాతం |
|---|---|---|---|
| పల్నాడు | 2,85,051 | 15,886 | 5.57 |
| బాపట్ల | 2,37,394 | 55,503 | 23.38 |
| గుంటూరు | 2,63,577 | 59,089 | 22.42 |



# నేడు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ

- చీరాల సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు
- ఐదు ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసిన యాజమాన్యం

చీరాల, జనవరి 4: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌ జన్యంతో ముత్యాల ముగ్గులు పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటలకు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో జరుగుతాయి. పోటీలో పాల్గొన దలచిన మహిళలు ఇప్పటికే ఆంధ్రజ్యోతి దినపత్రికలో వస్తున్న ప్రకటనలోని ఫోన్ నెంబర్లకు రిజిస్టర్ చేసుకున్నారు. పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు అందజేస్తారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు. పోటీలకు హాజరయ్యే మహిళలు సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల బస్సులలో రావచ్చు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ కూడలి, పేరాల కూడలి, నల్లగాంధీబొమ్మ కూడలి, కొత్తపేట కూడలిలో కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులలో రావచ్చు. పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలను తిరిగి బస్టాండ్ వద్ద దింపే ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలో పాల్గొనే మహిళలు అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్‌కు, ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 99490 73369, 9390307829, 9985411491లో సంప్రదించవచ్చు.



# కోడిగుడ్డుకు.. కోత

- గుడ్డు లేకుండానే జగనన్న గోరుముద్ద
- ధరలు పెరిగాయని పంపిణీ చేయని వైనం
- ప్రశ్నించిన ఉపాధ్యాయులపై రాజకీయ ఒత్తిడి



భోజనం చేస్తున్న విద్యార్థులు



గుంటూరు(విద్య), జనవరి 4: అమాంతం పెరిగిపోతోన్న కోడిగుడ్డు ధర మధ్యాహ్న భోజనం(జగనన్న గోరుముద్ద)పైనా ప్రభావం చూపుతోంది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కోడిగుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ధరలు పెరిగాయని ప్రభుత్వ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు పంపిణీ చేసే కోడిగుడ్డుకు కోత విధించారు. వందల పాఠశాలల్లో గుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ధరలు పెరిగాయని కోడిగుడ్లను పాఠశాలలకు సరఫరా చేయడం లేదు. దీంతో విద్యార్థులు వారం నుంచి కోడిగుడ్డు లేకుండానే భోజనం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4వేలకు పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.43 లక్షల మంది విద్యార్థులు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం (జగనన్న గోరుముద్ద) చేస్తారని రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన కొత్త మెనూ ప్రకారం వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డును భోజనంతోపాటు పంపిణీ చేయాలి. నెల నుంచి కోడిగుడ్ల ధరలు భారీగా పెరిగాయి. హోల్‌సెల్‌లో ఒక్కో గుడ్డు రూ.6.50కు విక్రయిస్తుండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7కు విక్రయిస్తున్నారు. పెరిగిన ధర ప్రకారం ఏజన్సీ నిర్వహకులు పౌల్ట్రీల నుంచి కోడిగుడ్లు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా పాఠశాలలకు సరఫరా నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనంలో గుడ్డు అందించడం లేదు. ఇదేమని ప్రశ్నించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఏజన్సీ నిర్వహకులు సరైన సమాధానం ఇవ్వడం లేదు. సరికదా గుడ్డు పంపిణీ గురించి ప్రశ్నించవద్దని కొంతమంది ప్రజా ప్రతినిధుల చేత వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో చేసేది లేక కొంతమంది ప్రధానోపాధ్యాయులు మౌనంగా ఉండిపోతుండగా మరికొందరు ఆయా జిల్లాల డీఈవోలకు ఫిర్యాదు చేశారు.

**అధికారులను ఖాతరు చేయని ఏజన్సీలు**

ప్రభుత్వ పాఠశాలలకు గుడ్డు సరఫరా చేయని ఏజన్సీలను అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇలా చేస్తే బిల్లులు నిలిపి వేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఏజన్సీ నిర్వహకులు రాజకీయ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం గుంటూరు నగరంలోని కొన్ని పాఠశాలలకు గుడ్డు సరఫరా చేయని ఏజన్సీ నిర్వాహకుడిపై విద్యాశాఖ ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పంపిణీదారు నగరానికి చెందిన ఓ ప్రముఖ ప్రజాప్రతినిధి చేత విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే దీనిని విద్యాశాఖ అధికారులు లెక్కచేయలేదు. మీరు ఎవరితో సిఫార్సు చేయించినా ఉపయోగం లేదు.. అవసరం అయితే మేమే వారితో మాట్లాడ తాం.. తక్షణం గుడ్డు సరఫరా చేయకుంటే బిల్లులు నిలిపివేస్తామని ఏజన్సీ నిర్వహకుడికి స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో కోడిగుడ్డు పంపిణీపై విద్యాశాఖ అధికారు లు క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఏ మండ లాల్లో ఏఏ పాఠశాలలకు ఎన్ని రోజుల నుంచి గుడ్లు సరఫరా చేయడం లేదనే విషయాలను ప్రధానోపాధ్యాయుల నుంచి నివేదిక రూపంలో సేకరించారు. ఆ నివేదికను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడానికి విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

# ఉధృతమైన.. ఆందోళనలు

- 24వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- 16వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల దీక్షలు
- భిక్షాటన చేసి పారిశుధ్య కార్మికుల నిరసన



బాపట్లలో భిక్షాటన చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు

బాపట్ల/బాపట్ల టౌన్, జనవరి 4: అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సర్వశిక్ష ఉద్యోగులు.. ఆందోళనలను ఉధృతం చేస్తున్నారు. రోజుకో రీతిన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తున్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది సమ్మెను గురువారం కూడా కొనసాగింది. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు, ఎలక్ట్రికల్ సిబ్బంది, మంచినీటి ఆపరేటర్లు విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరిస్తామని ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీని నాలుగున్నరేళ్లుగా నెరవేర్చలేకపోయారని పారిశుధ్య కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమానపనికి సమాన వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని కార్మిక సంఘాలతో కలిసి రానున్న రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్, కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జెబి.శ్రీధర్, ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి డివి.సుబ్బారావు, శారద, అంకమ్మరావు, విజయలక్ష్మి, గోపమ్మ పాల్గొన్నారు.

**రోడ్డుపై పడుకుని అంగన్‌వాడీల నిరసన**

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ రోడ్డుపై పడుకుని నినాదాలు చేశారు. బెదిరిస్తే బెదిరిపోము, వేతనాలు పెంచితేనే విధుల్లో చేరుతామంటూ నినదించారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆందోళనకు వెళ్తున్న సీఐటీయూ నాయకురాలు సుబ్బరావమ్మ అరెస్టును నిరసిస్తూ ఆమెకు అంగన్‌వాడీలు సంఘీభావం తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 6 నుంచి నిరాహారదీక్షకు సిద్ధమౌతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్, నాయకులు జె.శామ్యూల్, శరత్, వెలగా శైలశ్రీ, సీతామహలక్ష్మీ, పద్మావతి, హేమమాలిని, వసంత పాల్గొన్నారు.

**కలెక్టరేట్ వద్ద సర్వశిక్ష ఉద్యోగుల దీక్ష**

సమస్యల పరిష్కారానికి సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 16వ రోజు కొనసాగింది. కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు టి.మాణిక్యారావు మాట్లాడుతూ ఎస్పీడీ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అసిస్టెంట్ ఏఎంవో డాక్టర్ బి.మోజెస్ కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌వో తటవర్తి శ్రీనివాసరావు, ఉద్యోగులు జాన్‌వెస్లీ, ప్రసాద్, నాగరాజు, వీరయ్య, మోహన్, రవి, అనీల్, నాగమణి, లక్ష్మి, హరిత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

# దిక్సూచి
DIKSUCHI

# విదేశీ విద్య కొన్ని భ్రమలు

ఇప్పటి యువతలో విదేశాల్లో చదువుకోవాలనే ఆకాంక్ష ఎక్కువ. అయితే దీనికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రం అనుమానాలు, అపనమ్మకాలు కూడా ఎక్కువే. అయితే విదేశాల్లో చదువుకుంట్ను విద్యార్థులు, సంబంధిత అకడమిక్ నిపుణులతో మాట్లాడినప్పుడు పలు అంశాలపై మనోళ్ల అనుమానాలకు అర్థం లేదని అనిపించింది. అవేంటో చూద్దాం.

### ఖర్చు ఎక్కువ

విదేశీ చదువు అంటే ఖర్చుతో వ్యవహారం అనుకుంటారు. అయితే ఎంచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూషన్ తదితరాలను అనుసరించి వ్యయం ఉంటుంది. అంతేతప్ప ఏ కోర్సు తీసుకున్నా ఒకేరకమైన ఖర్చు ఉండదు. కొన్నిసార్లు విదేశీ యూనివర్సిటీలు, అక్కడి ప్రభుత్వాలు ఇచ్చే స్కాలర్‌షిప్స్‌తో చాలా వరకు భారాన్ని తగ్గించుకోవచ్చు. ఆన్ క్యాంపస్ జాబ్స్, టీచింగ్ అసిస్టెన్స్, రీసెర్చ్ అసిస్టెన్స్‌తోనూ ఒకింత ఉపశమనం పొందవచ్చు.

➡ ఇండియన్ యూనివర్సిటీలతో పోల్చుకుంటే విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకు అయ్యే వ్యయం ఎక్కువే. అయితే భారత దేశంలోని టైర్ వన్ పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో బీటెక్, మేనేజ్‌మెంట్ కూడా వ్యయభరితమే. అదే విదేశాల విషయానికి వస్తే కొన్ని వర్సిటీలు బ్రైట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజుల్లో పాతిక నుంచి డెబ్బయ్ అయిదు శాతం మేర మినహాయింపును ఇస్తున్నాయి.

### స్థానిక భాష రాకున్నా పర్వాలేదు

సాధారణంగా ఇంగ్లీష్ బోధన లేని దేశాలను విద్యార్థులు తమ జాబితా నుంచి తొలగిస్తూ ఉంటారు. అయితే అలా తీసేయాల్సిన పని లేదు. చాలా దేశాలు ఇప్పుడు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోసం ఇంగ్లీష్‌లో బోధనకు ముందుకు వస్తున్నాయి. అయితే ఇంగ్లీషులో బోధన ఉన్నంత మాత్రాన స్థానిక భాష అక్కర లేదు అన్నట్లు కాదు. లోకల్ లాంగ్వేజ్ ఎంత బాగా తెలిస్తే చదువు అంత బాగా ముందుకు సాగుతుంది అని ప్రొఫెసర్లు చెబుతుంటారు. అలాగే అక్కడే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని అనుకుంటే లోకల్ భాష తెలియకుంటే ఎలా అన్నదే ప్రశ్న. జర్మనీలో చదవాలనుకుంటే జర్మన్ లాంగ్వేజ్ నేర్చుకోవడం మంచిది. ఆ దేశం అనే కాదు ఎక్కడైనా శాశ్వతంగా లేదంటే తాత్కాలికంగా ఉండాలనుకునే వ్యక్తులకు స్థానిక భాషపై పట్టు అవసరం.

### చాలా దేశాల్లో చదువులు ఉచితం

కొన్ని యురోపియన్ దేశాల విషయంలో ఇది నిజం కూడా. అయితే ట్యూషన్ ఫీజులు మాత్రమే పూర్తిగా లేకుంటే సబ్సిడీతో కానీ ఉంటాయి. ఉదాహరణకు నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, డెన్మార్క్ తదితర దేశాలు ఫీజు మినహాయింపు లేదంటే సబ్సిడీ ఆఫర్స్ ఉంటాయి. జర్మనీలో ఆఫర్ చేసే అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ట్యూషన్ ఫీజులే ఉండవు. అయితే అకామిడేషన్, ఫుడ్ తదితర సొంత అవసరాలకు ఇండియన్ మనీలో ఏటా ఎనిమిది నుంచి పదిలక్షల మేర వ్యయమవుతుంది. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

### స్కాలర్‌షిప్స్ సాధించడం సులువు

అమెరికా, బ్రిటన్ విద్యా సంస్థల్లో చేరి స్కాలర్‌షిప్‌లు సాధించడం చాలా సులువు అనుకుంటారు కొంత మంది విద్యార్థులు. అయితే స్కాలర్‌షిప్స్ రావాలంటే మంచి అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఉండాలి. అలాగే కొన్ని స్కాలర్‌షిప్స్ మెరిట్ బేస్ట్ ఉంటే మరికొన్ని నీడ్ బేస్డ్‌గా ఉంటాయి. ఆయా సెక్షన్లకే ఇవి అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా చాలా స్కాలర్‌షిప్స్ గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ విద్యార్థుల కోసం మాత్రమే ఉంటాయి. అండర్ గ్రాడ్యుయేషన్‌కు అందుబాటులో ఉండేవి చాల తక్కువ.

➡ యూకే, అమెరికా ప్రభుత్వాలు కూడా భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తాయి. యూకే ప్రభుత్వం ఇచ్చే 'కామన్వెల్త్ మాస్టర్స్ స్కాలర్‌షిప్', 'కామన్వెల్త్ షేర్డ్ స్కాలర్‌షిప్', 'చెవనింగ్ స్కాలర్‌షిప్'లను - అకడమిక్ మెరిట్, ఫైనాన్షియల్ బ్యాక్‌గ్రౌండ్, ఎక్స్‌పీరియెన్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని మంజూరు చేస్తారు. 'ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్'ను కూడా మంజూరు చేస్తాయి. అయితే కొన్ని సంస్థలు విదేశీ విద్యార్థులకు ఫీజుల్లో పూర్తిగా, కొంత మేర మినహాయింపును ఇస్తాయి. ఇలాంటి వాటికి గ్యారంటీ అంటూ ఏమీ ఉండదు. నిధుల అందుబాటు, అకడమిక్ రికార్డు తదితరాలు ఆధారంగా వీటిని ఇస్తారు. అమెరికాలోని ఐవీ లీగ్ కాలేజీలు మరో అడుగు ముందుకేశాయి. వాటి అలూమ్నీ కూడా కార్పస్ ఫండ్‌తో అర్హులకు స్కాలర్‌షిప్స్‌ను అందిస్తుంటాయి.



### లెర్నింగ్ కష్టం

విదేశాల్లో చదువు అంటే కొద్దిగా కష్టంగానే అనిపిస్తుంది. అడాప్టబిలిటీ కోసం కష్టపడటం తప్ప మరో మార్గం లేదు. అయితే కోర్సు తీరుతెన్నులపై అవగాహన కోసం వారం నుంచి పదిరోజుల పాటు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుంది. మరో విషయం, అక్కడ కోర్సులు ఎక్కువగా ఇండస్ట్రీ నిర్దేశితంగా ఉంటాయి. కేస్ స్టడీలు ఉంటాయి. కేవలం థియరీ బోధనకే పరిమితం కావు. ప్రాక్టికల్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. ఫ్యాకల్టీ మెంబర్స్‌కు కూడా పది నుంచి పదిహేనేళ్ళ వరకు ఇండస్ట్రీ అనుభవం ఉంటుంది. ప్రాక్టికల్ ప్రపంచంతో మమేకమయ్యే థియరీలు ఉంటాయి. ఇండస్ట్రీలో ఏమి జరుగుతుందో అదే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పునకు తగ్గట్టు అడ్జస్ట్ కావడమే కాదు, ఎదగాల్సిన అవసరం మన విద్యార్థులకు ఉంటుంది.

### డిగ్రీ వ్యవధి ఎక్కువ

విదేశీ వర్సిటీల్లో నాలుగేళ్ళ కాలవ్యవధి కలిగిన డిగ్రీ కోర్సులు ఉంటాయి. మన దగ్గర ఇంజనీరింగ్, మెడిసిన్ తప్ప ఇతర యూజీ విద్యార్థులను అలా చదివించడానికి విద్యాలయాలు వెనకాడుతాయి. అమెరికన్ వర్సిటీలు చాలావరకు ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. అంటే కోర్సుకు నిర్దేశించిన క్రెడిట్స్‌ను ముందస్తుగా పూర్తి చేయగలిగితే మూడేళ్ళకే డిగ్రీని ఇస్తాయి. అందుకోసం ప్రతి సెమిస్టర్‌లో అదనంగా కొన్ని కోర్సులను తీసుకోవాలి. అలా బరువు పెంచుకోవడమే కాదు, సమ్మర్ క్లాసులకు కూడా హాజరై ముందుగానే కోర్సు పూర్తిచేసుకోవచ్చు. అయితే ఈ వెసులుబాటుపై ఎక్కువ మందికి అవగాహన ఉండదు.

### క్షేమమేనా

విదేశాలకు పిల్లలను పంపడం అంత క్షేమం కాదన్న భ్రమలో చాలా మంది తల్లిదండ్రులు ఉంటారు. అప్పుడప్పుడు జరిగే కొన్ని సంఘటనలు వారిని ఇలా ఆలోచించేలా చేస్తాయి. ఇందులో నిజం వేరుగా ఉంది. వాస్తవానికి అకామిడేషన్ తదితర అంశాల్లో యూనివర్సిటీలే బాధ్యత తీసుకుంటాయి. సురక్షితమైన ట్రాన్స్‌పోర్టేషన్ సహా విద్యార్థులతో కనెక్ట్ అయ్యే విషయంలోనూ సూచనలు ఇస్తాయి. తద్వారా తమ విద్యార్థులు అంతా సౌకర్యంగా ఫీలయ్యేలా, క్యాంపస్‌లో హాయిగా చదువుకునేలా చూస్తాయి. విద్యార్థులు తమ వర్సిటీకి ఒక మెసేజ్ ఇస్తే చాలు స్పందిస్తాయి. వెంటనే అకడమిక్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లు రంగంలోకి దిగి ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకుంటాయి. దీనికోసం యాప్స్‌ను కూడా వర్సిటీలు నిర్వహిస్తూ ఉంటాయి.

### స్నేహితులను చేసుకోవడం కష్టం

విదేశీ విద్యార్థులను ఎక్కువగా తీసుకునే యూనివర్సిటీలు తమ స్టూడెంట్స్ మధ్య ఇంటరాక్షన్ కోసం పలు చర్యలు తీసుకుంటాయి. అందుకోసం ప్రత్యేకించి ఈవెంట్స్‌ను నిర్వహిస్తాయి.

### ఉద్యోగాలు వస్తాయా?

ఐవీ లీగ్ యూనివర్సిటీలో చదివే వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయనేది భ్రమ. టెక్ కంపెనీలు అంటే మొదటి వరుసలో ఉండేవే కాదు అంతకుమించి పెద్ద కంపెనీలు కూడా ఉన్నాయి. వేటికవి కొన్ని నిబంధనలకు లోబడి తమ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను నిర్వహిస్తాయి. విదేశాల్లో టూటైర్ పట్టణాల్లోని యూనివర్సిటీ విద్యార్థులకు కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. విద్యార్థి ఏ ఎకనామిక్ సైకిల్‌కు చెందిన వ్యక్తి అన్నది ప్లేస్‌మెంట్స్‌లో ప్రాధాన్యం కలిగి ఉంటుంది. అంటే ఇక్కడ ఐఐఎం, ఐఐటి విద్యార్థులకు మిగిలిన వారికి ఉన్న తేడా మాదిరిగానే ఉంటుంది.

### దరఖాస్తు ప్రక్రియ క్లిష్టం

కోర్సు ఏదైనప్పటికీ విదేశీ వర్సిటీల దరఖాస్తు ప్రక్రియ దాదాపుగా ఒకేలా ఉంటుంది. అకడమిక్ అర్హతల నుంచి ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో అడిగే స్కోర్‌లు కూడా దాదాపుగా ఒకేలా ఉంటాయి. చాలా వరకు యూనివర్సిటీలు స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్స్ ఆఫ్ రికమెండేషన్‌ను అడుగుతాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో గ్రేడులను చూస్తాయి. స్కాలర్‌షిప్స్‌ను అందించే సంస్థలకు కూడా ఇవే అవసరమవుతాయి. అయితే దరఖాస్తు ప్రక్రియ, సెలెక్షన్ వంటివి సుదీర్ఘంగా సాగే వ్యవహారమే అయినప్పటికీ ఎక్కడా క్లిష్టత అంటూ ఏమీ ఉండదని సంబంధిత అకడమిక్ నిపుణులు అంటారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/jiMMeeoలో చదవండి.

# జేఎన్‌టీయూహెచ్‌లో పార్ట్ టైమ్ పీజీ

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)- పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఉద్యోగులకు ప్రత్యేకించారు. దరఖాస్తు నాటికి హైదరాబాద్ పరిధిలో కనీసం ఏడాదిపాటు ఉద్యోగం చేసిన అనుభవం తప్పనిసరి. దరఖాస్తుతోపాటు ఒరిజినల్ సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు ఎటువంటి స్కాలర్‌షిప్ లభించదు.

**స్పెషలైజేషన్‌లు:** ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, ఇంజనీరింగ్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ప్రత్యేకించారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో హెచ్‌ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

**అడ్మిషన్ టెస్ట్ వివరాలు:** పరీక్ష సమయం గంట. ఇందులో మొత్తం 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంబీఏ అభ్యర్థులకు అనలిటికల్/రీజనింగ్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్న లు అడుగుతారు. ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. టెస్ట్ తేదీలను త్వరలో ప్రకటిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

# ఐఐఎం రోహ్‌తక్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు



రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రోగ్రామ్‌ను అనుసరించి జాతీయ పరీక్ష స్కోర్ లేదా సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్, అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

- వెబ్‌సైట్: www.iimrohtak.ac.in

### పీజీ ప్రోగ్రామ్(పీజీపీ)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ సంబంధిత సబ్జెక్టులు, రెండో ఏడాది ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ఏడాదికి మూడు టర్మ్‌లు చొప్పున మొత్తం ఆరు టర్మ్‌లు ఉంటాయి.

**ఎలక్టివ్ స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజీ.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.2928
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 5

### డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(డీపీఎం)

- ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్. విదేశీయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.

**రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్:** ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీసెర్చ్ ఆప్టిట్యూట్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.

**ఫెలోషిప్:** మొదటి రెండేళ్లు నెలకు రూ.34,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. నిబంధనల ప్రకారం మెరిట్ ఫెలోషిప్ కింద రెండో ఏడాది నెలకు రూ.10,000; మూడు, నాలుగు సంవత్సరాల్లో నెలకు రూ.15,000 చెల్లిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.2,50,000 ఇస్తారు. జాతీయ, అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2928
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **డీపీఎం రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 15
- **ఇంటర్వ్యూలు:** ఏప్రిల్, 15, 16
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25
- **రిపోర్టింగ్ తేదీ:** జూన్ 6

### ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్, స్పోర్ట్స్ పర్సన్స్, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్స్‌కు ఉద్దేశించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఉల్‌స్టర్ యూనివర్సిటీ (యూకే)లో ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్ పొందే వీలుంది.
- ఈ ప్రోగ్రామ్‌ను బ్లెండెడ్ లెర్నింగ్ - ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సెషన్స్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటరాక్టివ్ సెషన్స్, లైవ్ ప్రాజెక్ట్‌లు, ఇండస్ట్రియల్ విజిట్స్ ఉంటాయి.
- **అర్హత:** ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగాల్లో అనుభవం ఉండాలి. స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్(ఆన్‌లైన్), ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్:** ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్, స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 9

# నవ్య | చిత్రజ్యోతి

## డిప్యూటీ సీఎం భట్టితో చిరంజీవి భేటీ



సినీ నటుడు చిరంజీవి గురువారం డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ ప్రజాభవన్‌కు వెళ్లి, భట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. కశ్మీర్ నుంచి తెప్పించిన శాలువాతో భట్టిని సత్కరించారు. చిరంజీవి దంపతులకు డిప్యూటీ సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

## ఫిబ్రవరి బరిలోకి ఈగల్



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఈగల్' చిత్రం విడుదల తేదీ మారింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గతంలో యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సంక్రాంతికి అరడజనుకు పైగా పెద్ద హీరోల చిత్రాలు విడుదలవుతుండడంతో కొన్ని సినిమాలకు థియేటర్ల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సంయుక్త సమావేశం నిర్వహించాయి. ఒకేసారి ఎక్కువ సినిమాల విడుదల వల్ల నష్టపోయే అవకాశం ఉండడంతో దీనిని నివారించేందుకు ఆయా చిత్రాల నిర్మాతలతో చర్చించాయి. నిర్మాత దిల్‌రాజు నేతృత్వంలో సాగిన చర్చలు ఫలించి 'ఈగల్' చిత్రం రిలీజ్‌ను వాయిదా వేసేందుకు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల అంగీకరించారు. తమ చిత్రానికి కొత్త రిలీజ్ డేట్‌ను ఖరారు చేశారు. ఫిబ్రవరి 9న 'ఈగల్'ను విడుదల చేయనున్నారు.

## ప్రేమకథకు కనెక్ట్ అవుతారు



కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. శివశక్తి రెడ్ డీ దర్శకుడు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమకథ' చిత్ర నేపథ్యం నిజ జీవిత సంఘటనలకు దగ్గరగా ఉంటుంది. ప్రేక్షకులు కథాంశంతో కనెక్ట్ అవుతారు' అన్నారు. 'నటీనటులు అంతా కష్టపడి మంచి సినిమా చేశారు. మధుర శ్రీధర్, ధీరజ్, శింగనమల కల్యాణ్ సాయం చేశారు. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని నిర్మాతలు కోరారు.

## సినిమా స్థాయిని బట్టి థియేటర్లు ఇవ్వాలి



కె. నిరంజన్ రెడ్డి

తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. కె. నిరంజన్‌రెడ్డి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి సినిమా విశేషాలను విలేకరులతో పంచుకున్నారు.

● 'హను-మాన్' నిర్మాతగా నాకు తొలి చిత్రం. భారీ స్థాయిలో రూపుదిద్దుకోవడం, సంక్రాంతికి విడుదలవుతుండడం ఆనందాన్నిచ్చాయి. హాలీవుడ్‌లో సూపర్‌హీరో ఫ్రాంచైజీలో చాలా చిత్రాలు వచ్చాయి. అలాంటి ఫ్రాంచైజీ మనకు కూడా ఒకటి ఉండాలని ఈ సినిమా చేశాం. ఆంజనేయస్వామిని మన సంస్కృతిలో సూపర్‌హీరో అనుకోవచ్చు. సినిమా చూసిన ప్రేక్షకులంతా హనుమంతుడిని దర్శించుకున్న అనుభూతికి లోనవుతారు.

● ఈ సినిమా కోసం మేం మూడేళ్లు కష్టపడ్డాం. ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన వచ్చింది. దాంతో కంటెంట్‌కు కావాల్సినవన్నీ ఎక్కడా రాజీపడకుండా సమకూర్చాం. ముందు అనుకున్న బడ్జెట్ కన్నా ఐదు రెట్లు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. 'హను-మాన్' వీఎఫ్‌ఎక్స్ క్వాలిటీ అద్భుతంగా ఉంది. ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన ప్రతిఫలం తెరపై కనిపిస్తుంది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సినిమా స్థాయి పెరుగుతూ వచ్చింది. దానికి తగ్గట్టే సినిమాకు దేశ, విదేశాల్లో మంచి బిజినెస్ జరిగింది.

● సంక్రాంతికి ఎన్ని సినిమాలు బరిలో ఉన్నా 'హను-మాన్' విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. చాలా లాంగ్ రన్ ఉన్న చిత్రమిది. అందుకే ముందుగా ఎక్కువ థియేటర్లలో చేయాలని తొందరపడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 20 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగింది. హిందీలో 200 స్క్రీన్లలో రిలీజ్ చేస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నాయి. దాన్ని దృష్టిలో ఉంచుకొని మా సినిమా స్థాయికి తగిన సంఖ్యలో థియేటర్లు ఇవ్వాలని పరిశ్రమ పెద్దలను కోరుతున్నాం. 'హను-మాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి గారు అతిథిగా వస్తున్నారు. బిజీ షెడ్యూల్‌లోనూ వెసులుబాటు చేసుకొని రవితేజ గారు కోటి అనే పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చారు. వారికి ధన్యవాదాలు. మా బేనర్‌లో చేయబోయే కొత్త చిత్రాలను ఫిబ్రవరిలో ప్రకటిస్తాం.




## ఫిబ్రవరిలో ఆట మొదలు



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదలచేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గీతానంద్ ఈ చిత్రంతో హీరోగా మరో మెట్టు ఎక్కుతాడనే నమ్మకం ఉంది. నేహా సోలంకి తన అభినయంతో ఆకట్టుకుంటుంది. దయానంద్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. విభిన్నమైన కథతో తెరకెక్కిన మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. తన జీవితాన్ని చాలించాలనుకున్న ఓ వ్యక్తి రియల్‌టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ఆసక్తికరంగా ఉంటుంద'న్నారు. మధుబాల కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి అభిషేక్ ఏ ఆర్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: అరవింద విశ్వనాథన్.

## జాలరి జీవిత పోరాటం



మత్స్యకారుల జీవితం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రేవు'. వంశీ రామ్, స్వాతీ భీమ్ రెడ్డి జంటగా నటించారు. ఎల్బీ శ్రీరామ్ అతిథి పాత్ర పోషించారు. సముద్రంలోని మత్స్యసంపదపై ఆధిపత్యం కోసం జరిగే పోరాటం నేపథ్యంలో దర్శకుడు హరినాథ్ పులిచర్ల తెరకెక్కించారు. ఏ. ఆర్ ఫిలిం టీమ్, విజయా టాకీస్ సంయుక్తంగా నిర్మించాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టీజర్, పోస్టర్‌ను సీనియర్ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హరినాథ్ రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ చిత్రం తీశాడు. మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రేవు' చిత్రం ఫస్ట్ కాపీ సిద్ధమైంది. ఫిబ్రవరిలో విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు.

## చల్లగాలి ప్రేమగీతం



ప్రణవ్, షజ్ఞ శ్రీ హీరో హీరోయిన్లుగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. ఇటీవలే విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ దక్కింది. గురువారం చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'చల్లగాలి' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'పీరియాడిక్ నేపథ్యంలో కథ సాగుతుంది. పుంగనూరు గ్రామంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తక్కువ బడ్జెట్‌లోనే మంచి సినిమాను తీశాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాత తెలిపారు. ప్రేక్షకులను రెండు దశాబ్దాలు వెనక్కు తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుంది అని ప్రణవ్ చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/j9BnEaS లో చదవండి.



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

## బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీనే

- రాష్ట్రంలో సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ
- ఓటమి భయంతోనే అభ్యర్థులను మార్చుతున్నసీఎం జగన్‌రెడ్డి
- బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 4: రాష్ట్ర రాజకీయ చరిత్రలో బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీయేనని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో అనగాని పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వం మునిగిపోతున్న నావ అని, అందుకే సీఎం జగన్‌రెడ్డి తాను ఎలాగైనా ఒడ్డున పడేందుకు ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను (ముంచుతున్నాడని) మార్చుతున్నాడని అన్నారు. ఎన్ని మార్పులు చేర్పులుచేసిన 2024లో చంద్రబాబు నాయుడు సీఎం కావటం తథ్యమన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల కోసం నిరవధికంగా సమ్మెలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటం సిగ్గుచేటన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి ఒక్క రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్‌నే అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి అండగా నిలవాలని ఆయన కోరారు.







# వృక్షవిలాపం

- ఎండిపోయాయన్న వంకతో భారీ వృక్షాలు నరికి వేత
- దుంగలు లారీలలోతరలింపు
- తమకేమి తెలియదంటున్న తెనాలి ఇరిగేషన్ ఈఈ

తెనాలిరూరల్, జనవరి4: పచ్చగా కలకలలాడుదూ చల్లని ప్రకృతి గాలిని ఇస్తూ ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న వృక్షాలవి. ఏళ్ల నాటి నుండి అంచలంచలుగా ఎదిగి భారీ వృక్షాలుగా నిలిచాయి. వాటి నుంచి ఏ ఒక్కరికి ఇబ్బందులు లేకపోయినా ఎండిన వృక్షాలనే పేరుతో పచ్చని చెట్లను నరికివేస్తున్నారు.

తెనాలి పట్టణంలోని వైకుంఠపురం రోడ్డులో తూర్పు కాలువకట్టపై ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భారీ వృక్షాలు నరికివేతకు గురయ్యాయి. పచ్చగా ఉన్న భారీ వృక్షాలను తొలగించి ప్రధాన రహదారిపైనే వాటిని ముక్కలుగా చేసి రూ.లక్షలు విలువచేసే దుంగలను లారీలలో తరలిస్తున్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారులే దగ్గరుండి వృక్షాలను నరికివేయిస్తూ దుంగలను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వృక్షాలు ఎండినవి ప్రమాదకరంగా ఉంటే వాటికి వేలం నిర్వహించి దాని ద్వారా తొలగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వేలం ద్వారా వచ్చె సొమ్మును ప్రభుత్వానికి జమచేయాల్సి ఉంటుంది. ఐతే ఇవేమి లేకుండానే పూర్తి ఉచితంగా ఎండిన చెట్లపేరుతో పచ్చని చెట్లను నరికి వాటికి వచ్చిన భారీ దుంగలను ట్రాఫిక్ నిలిపి మరీ లారీల్లో తరలించడం విశేషం. దీనిపై తెనాలి ఇరిగేషన్ ఈఈ మల్లికార్జునను వివరణ కోరగా.. అసలు తనకు వృక్షాలు నరికే విషయం తెలియదనడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజనిజాలను తేల్చాలని పలువురు కోరుతున్నారు.



భారీ వృక్షాన్ని నరికి ముక్కలు చేస్తున్న దృశ్యం





దుంగలను లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

## బీజేపీ పాలనతో రాజ్యాంగానికి పెనుముప్పు

- ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి రక్షణ
- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

గుంటూరు, జనవరి 4: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనతో రాజ్యాంగానికి పెనుముప్పు రాబోతున్నదని, ప్రజాస్వామ్యాన్ని పరిహసించే పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీభవన్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు, బలహీనవర్గాల హక్కులను పరిరక్షించేందుకు ఇండియా కూటమికి అండగా నిలిచి గెలిపించుకోవాల్సిన చారిత్రతక ఆవశ్యకత ఉన్నదన్నారు. రాష్ట్రంలోనూ వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు మూడు బీజేపీని ప్రత్యక్షంగాను, పరోక్షంగాను బలపరుస్తూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాయని రానున్న ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమి పార్టీలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవటం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు లామ్ తాంతియాకుమారి, ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ప్రజా సంఘాల నేతలు కుమ్మర క్రాంతికుమార్, కుర్రా పున్నారావు, సాంబశివరావు, జయసుధ, సాంబయ్య, చిష్టీబాషా, రత్తయ్య, చంద్రపాల్, జవహర్‌బాబు, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జేడీ శీలం, హాజరైన పలు సంఘాల నాయకులు



ధర్నాచేస్తున్న వారితో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ

## మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- రోడ్డుపై బైఠాయించి బంధువుల ఆందోళన
- పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు
- రెండు గంటలపాటు నిలిచిన ట్రాఫిక్

ముప్పాళ్ళ డిసెంబరు 4: ముప్పాళ్ళలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షేక్ మన్సూర్‌వలి(40) కుటుంబానికి న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం పెద్ద ఎత్తున స్థానిక పోలీసు స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. గురువారం గుంటూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వాహనంలో ముప్పాళ్లకు తీసుకు వచ్చారు. కాగా ఆ వాహనాన్ని రోడ్డుపైనే ఉంచి ధర్నాకి దిగారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ను పోలీసులు తమకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. డ్రైవరును కావాలనే తప్పించారని ఆరోపిస్తూ 300మంది వరకూ 2 గంటలకు పైగా రోడ్డుపై ధర్నా చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ వారితో మాట్లాడే ప్రయత్నం చేసినా వారు ఏమాత్రం వినిపించుకోలేదు. పోలీసులు డౌన్‌డౌన్, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అప్పటికే రోడ్డుకు ఇరువైపులా 5 కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ఒకదశలో లాఠీచార్జ్ చేసేందుకు కూడా పోలీసులు సిద్ధమయ్యారు. ధర్నా చేస్తున్న వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో లాఠీచార్జ్ ఆలోచనను పోలీసులు విరమించుకున్నారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వాహన యజమానితో మాట్లాడి ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. రూ.2.50 లక్షలు మృతుడి కుటుంబానికి చెల్లించేందుకు వాహన యజమాని అంగీకరించేలా సంధి కుదిర్చారు. దీంతో బాధిత కుటుంబీకులు, వారి బంధువులు ధర్నాను విరమించారు. ఇదిలాఉంటే మన్సూర్‌వలి మృతికి కారణమైన వాహన డ్రైవరు బుధవారం రాత్రి పోలీసుస్టేషన్ ఆవరణలో పురుగు మందు తాగే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అతనిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సమాచారం.

**ఇప్పుడు గుర్తొచ్చామా... మంత్రి అంబటిపై ఆగ్రహం ..**

ధర్నా చేస్తున్న వారికి కేవలం కిలోమీటరు దూరంలో చాగంటి వారిపాలెంలో మంత్రి అంబటి రాంబాబు పించన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చారు. 'మాకు ఇంత అన్యాయం జరిగితే మంత్రి రాడా.. ఓట్ల కోసం ఎలా వస్తాడో చూస్తాం..' అంటూ పలువురు ఆపార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యి మృతదేహాన్ని ఇంటికి తరలించిన తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో మృతుని కుటుంబ సభ్యులను మంత్రి అంబటి పరామర్శించేందుకు వెళ్లారు. ఆ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనపై ఆగ్రహంవ్యక్తంచేశారు. ఆందోళన వద్దకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మీకు ఇప్పుడు గుర్తొచ్చామా.. మావే 100 ఓట్లకు పైగా ఉన్నాయి.. ఈదఫా ఓట్లు అడగటానికివస్తే చెప్పులతో కొడతాం.. అంటూ బిగ్గరగా మాట్లాడటంతో వారికి పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం మంత్రి అంబటి అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

ముందస్తు సమాచారం లేకుండానే...

## తిరుపతి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రయాణీకులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరులో బయలుదేరి నరసరావుపేట, నంద్యాల మార్గంలో ప్రయాణించి తిరుపతి చేరుకొనే ఎక్స్‌ప్రెస్‌ని రైల్వే శాఖ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే దారి మళ్లించింది. గురువారం సాయంత్రం ఈ పరిణామం చోటు చేసుకొన్నది. నెంబరు. 17261 గుంటూరు - తిరుపతి రైలు నిత్యం సాయంత్రం 4.30కి బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 4.05కి తిరుపతి చేరుకొంటుంది. జగ్గంబొట్ల కృష్ణాపురం వద్దనాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా గురువారం ఈ రైలుని తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదగా దారి మళ్లించారు. బుధవారం సాయంత్రమే రైల్వే శాఖ ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది. ఇదే విషయాన్ని గుంటూరు ఆపరేటింగ్ విభాగానికి కూడా చేరవేసింది. అయితే ఆ తర్వాత ఎక్కడ సమచార లోపం జరిగిందో ఈ రైలుని దారి మళ్లిస్తున్నట్లు రైల్వే కమర్షియల్ విభాగం నుంచి ఎలాంటి ప్రకటన జారీకాలేదు. రిజర్వుడ్ ప్రయాణీకులకు మాత్రమే ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే ఈ రైలులో ఎక్కువ సంఖ్యలో జనరల్ బోగీలున్నాయి. దాంతో జనరల్ టిక్కెట్‌లు కొనుగోలు చేసి వందల సంఖ్యలో ప్రయాణీకులు తిరుపతి వెళుతుంటారు. నారాయణాద్రి, శబరి ఎక్స్‌ప్రెస్‌లలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేని వారు ఈ రైలులోనే ప్రయాణిస్తారు. అలానే నరసరావుపేట, వినుకొండ తదితర ప్రాంతాల ప్రయాణీకులు కూడా తిరుపతికి ఈ రైలులోనే వెళుతుంటారు. అలాంటిది ఎలాంటి సమాచారం లేకుండా దారి మళ్లించడంతో చాలామంది ప్రయాణీకులు ఆయా రైల్వేస్టేషన్లకు వచ్చి తీవ్ర నిరాశకు గురయ్యారు. ముందు గానే ప్రకటించి ఉంటే తాము ప్రత్యామ్నాయం చూసుకొనే వారమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీసీఐ కొనుగోళ్లపై విచారణకు రంగం సిద్ధం

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


గుంటూరు సిటీ, జనవరి 4: గుంటూరు కేంద్రంగా సీసీఐ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనాలను ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. సీసీఐ కేంద్రానికి పత్తి అమ్మకానికి తెచ్చిన రైతులను కొందరు మిల్లర్లు ఇబ్బందులకు గురిచేసిన విషయం తెలిసిందే. పత్తి నాణ్యత తక్కువగా ఉందంటూ క్వింటాకు 10 కేజీల వరకు కోత కోస్తూ వచ్చారు. ఈ మొత్తం వ్యహారంలో కీలకంగా ఉండాల్సిన బయ్యర్‌ను పక్కనపెట్టి ప్రయివేటు వ్యక్తులు పెత్తనం చెయ్యడం వివాదాస్పదం అయింది. క్వింటాకు అధిక మొత్తంగా కోత విధించడంపై ఆందోళన చెందిన రైతులు మైలవరం సీసీఐ కేంద్రం వద్ద రాస్తారోకో నిర్వహించారు. రైతుల రాస్తారోకోతో అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. మార్కెటింగ్ శాఖ అధికారులు సీసీఐలో జరుగుతున్న తంతుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రెండు మిల్లుల్లోనే ఎక్కువగా రైతులను నష్టపరిచినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సీసీఐ విజిలెన్స్ అధికారుల ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ఇదిలా ఉంటే నాణ్యత తక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయబోమని సీసీఐ అధికారులు చెబుతుండటం కూడా రైతుల్లో ఆగ్రహావేశాలకు కారణం అవుతుంది. తుపానుకు తడిచిన పంటను కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాటలను రైతులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. సీసీఐ అధికారులతో రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో..

- మరో 26.90 కిలోమీటర్ల రైలు మార్గం నిర్మాణం పూర్తి
- సీఆర్‌ఎస్ ఇన్‌స్పెక్షన్ చేసి ఫిట్‌నెస్ జారీ

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో కీలకమైన మరో మైలురాయిని రైల్వే శాఖ అధిగమించింది. జగ్గంబొట్లకృష్ణాపురం - సోమిదేవిపల్లి - గిద్దలూరు మధ్యన 26.90 కిలోమీటర్ల సెక్షన్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఇందుకు సంబంధించి గురువారం దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. మోటారు ట్రాలీ, స్పీడ్‌టెస్టు, వెనక కిటికీ ద్వారా ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసి రైళ్ల రాకపోకలకు అనుమతిస్తూ ఫిట్‌నెస్ జారీ చేశారు. దాదాపుగా 125 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ టెస్టు జరిగినట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ఈ సెక్షన్‌లో మూడు ప్రధాన వంతెనలు, 39 చిన్న బ్రిడ్జీలను రికార్డు సమయంలో రైల్వే శాఖ పూర్తి చేసింది. ఇందుకోసం కేవలం ఆరు నెలల వ్యవధిని మాత్రమే తీసుకొన్నది. సోమిదేవిపల్లిలో 2, గిద్దలూరులో ఒక కొత్త ప్లాట్‌ఫాంలతో పాటు వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాం షెల్టర్, వాటర్ ట్యాప్‌లు వంటి సౌకర్యాలను కల్పించారు. దీంతో గుంటూరు నుంచి గిద్దలూరు వరకు 2 వరసల రైలుమార్గం అందుబాటులోకి వచ్చింది. ఇక క్లిష్టమైన గిద్దలూరు - గాజులపల్లి సెక్షన్ పూర్తి అయితే నంద్యాల వరకు డబుల్ లేన్‌లో రైళ్లు ప్రయాణిస్తాయి. ఈ తనిఖీలో గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, సీనియర్ డీఎస్‌వో విజయకీర్తి, సీనియర్ డీవోఎం కిరణ్‌కుమార్, సీనియర్ డీఈఎన్- కో-ఆర్డినేషన్ జేవీ అనూష, డీసీఎం కే కమలాకర్‌బాబు పాల్గొన్నారు.



గుంటూరు - గుంతకల్లు మార్గంలో ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తున్న సీఆర్‌ఎస్ మాధవి

## జగన్‌రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు

- ప్రజాగ్రహాన్ని తట్టుకోలేకే ఆపార్టీకి ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలు
- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నరసరావుపేటటౌన్, జనవరి4: జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు వ్యక్తమవుతోందని, ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైసీపీలోని చాలా మంది ప్రజా ప్రతినిధుల రాజకీయ భవితవ్యం ఎలా ఉంటుందో వారికే అర్థంకావడం లేదని, అందుకే వారు ఆ పార్టీని వీడుతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. వచ్చే ఎన్నికల సందర్భంగా వారు చెప్పుకోవడానికి ఏ ఒక్క అభివృద్ధి పని లేకపోవడంతో ప్రజలు తమకు ఓట్లు వేయరని ఆ పార్టీ నేతలకు భయం పట్టుకుందన్నారు. అందుకే ఆ పార్టీ నేతలు రాజీనామాల బాట పట్టారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జగన్‌రెడ్డిలో అధికారం కోల్పోతామని భయం ఎక్కువైందన్నారు. అందుకే స్థానికంగా సిట్టింగ్‌లను మార్చుతూ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో ఓ ఆట ఆడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలకు భయపడి సొంత సీటులో పోటీచేసేందుకు జంకుతున్నారని, మరో 60 మంది పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని జీవీ ఆంజనేయులు తెలిపారు.

## వైసీపీ సమన్వయకర్తల అరాచకత్వం

- అధికారులు సైతం పాలేరులుగా మారుతున్న వైనం
- రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఈ దుస్థితి లేదు
- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 4: అడ్డదారుల్లో అధికార దర్పం ప్రదర్శిస్తున్న వైసీపీ నియోజకవర్గ సమన్వకర్తల అరాచకత్వం రోజురోజుకు పెచ్చుమీరుతుందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. చిలకలూరిపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ సమన్వకర్తలు ఏ హోదా, ఏ అధికారంతో ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక సమావేశాలకు హాజరవుతున్నారని, సమీక్షలు నిర్వహిస్తున్నారని, అభి వృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, సంక్షేమ పథకాల పంపిణీలో పాల్గొంటు న్నారని ప్రశ్నించారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ ఈ దుస్థితి లేదని, ఇందుకు అధికారులే సమాధానం చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. ఒక దళిత యువకుడిని చంపిన వ్యక్తికి బొకేలు ఇచ్చి వంగివంగి సెల్యూట్‌లు కొట్టడానికి పోలీసులకు సిగ్గుండాలన్నారు. జిల్లాలో కలెక్టరేట్‌లు, మునిసిపల్ కార్యాలయాలు ఎక్కడచూసినా వైసీపీ సమన్వయకర్తలే రాజ్యమేలుతున్నారని, వారే ప్రభుత్వం అన్నట్టు భావిస్తున్న మునిసిపల్, పోలీసు వ్యవస్థ ఎన్నికలను ఏవిధంగా నిష్పక్షపాతంగా నిర్వహించగలుగుతారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్తామని, సీఎస్, డీజీపీకి కూడా ఫిర్యాదు చేస్తున్నామని, గత వారం రోజులుగా జరిగిన పరిణామాలపై ఏం చర్యలు తీసుకుంటారో సమాధానం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ఇన్‌చార్జ్‌లు శంకరగిరి మాన్యాలు పట్టి పోవటం ఖాయమని, తరువాత ఈ అధికారుల పరిస్థితి ఏమిటో ఆలోచించు కోవలని ఆయన హెచ్చరించారు.



తుళ్లూరులో అమరావతి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళలు, రైతులు

## కౌలు చెల్లించమంటే వంకలు చెపుతున్నారు

- 1479 వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 4: ఒక్క రూపాయి తీసుకోకుండా రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలు భూములిస్తే, ఆ భూములకు కౌలు చెల్లించాల్సిన ప్రభుత్వం చెల్లించకుండా వంకలు చెబుతుందని రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు. మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1479వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని సీఎం జగన్‌రెడ్డి ఆడుతున్న నాటకంతో నాలుగున్నర ఏళ్ల నుండి నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయి ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రజా రాజధాని అంటేనే ముందుకు వచ్చి భూములిచ్చామన్నారు. ఇప్పుడు మూడు ముక్కలు చేసి అమరావతికి విలువ లేకుండా చేయాలని వైసీపీ ప్రభుత్వం చూస్తుందన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించే వరకు వెనక్కి తగ్గేదే లేదని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

## అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు

బొల్లాపల్లి, జనవరి 4: పల్నాడుజిల్లా, బొల్లాపల్లి మండలంలోని రేమిడిచర్ల గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 567 లోని 83 ఎకరాల ప్రభుత్వ కొండ క్వారీ భూమిలో విలువైన బలపాల పొడి, బలపాల రాళ్ళు ఉన్నాయి. మార్కెట్‌లో వీటికి విపరీతమైన గిరాకీ ఉన్నందున ఆ భూమిలో కొందరు అనధికారికంగా తవ్వకాలు జరుపుతున్నారని రేమిడిచర్ల గ్రామ సర్పంచ్ వడితె బ్రహ్మానాయక్ నరసరావుపేట జియాలజీ ఏడీప బీ.నాగినీకి గురు వారం ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ క్వారీయింగ్‌పై మం డల స్థాయి అధికారు లకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తక్షణమే ఆ క్వారీని పరిశీలించి లారీ లను సీజ్‌చేయాలని గ్రామస్థులు, సర్పంచ్ ఆమెకు ఫిర్యాదు చేశారు. 2022 మార్చిలో ఆకొండ ప్రాంతంలో కొందరు అక్రమ మైనింగ్ చేస్తుండగా గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మైనిం గ్ అండ్ జీయాలజీ ఏడీప దాడులు చేసి లారీలను పట్టుకొని సీజ్ చేశారన్నారు. ప్రస్తుతం గత 20 రోజుల నుంచి ఆ కొండ ప్రాం తంలో అక్రమ క్వారీయింగ్ జరుగుతుంని, వారిని అడ్డుకొని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స ర్పంచ్, గ్రామస్థులు అధికారులను కోరారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 186.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 196.00 |

## 53,966 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 55,013 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 53,966 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 35,748 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 10000 | 21500 | 334 | 10000 | 22000 |
| నెంబరు. 5 | 9500 | 18500 | నెంబరు. 5 | 13000 | 13000 |
| 273 | 13000 | 17500 | 273 | – | – |
| 341 | 9500 | 20000 | 341 | 13000 | 18000 |
| 4884 | 15500 | 15500 | 4884 | – | – |
| సూపర్ 10 | -- | -- | సూపర్ 10 | – | – |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8500 | 22000 | తేజ | 10700 | 23000 |
| బ్యాడిగి | 9500 | 23000 | బ్యాడిగి | 14000 | 14000 |
| దేవనూరు డీలక్స్ | 9500 | 19500 | దేవనూరు డీలక్స్ | 16000 | 16000 |
| తెల్లకాయలు | 5000 | 14000 | తెల్లకాయలు | 7500 | 12000 |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె





కౌంటింగ్ గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

## నిబంధనలు అనుసరించి కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు : కలెక్టర్

బాపట్ల, జనవరి 4: ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం బాపట్ల వ్యవసాయ కళాశాలలోని ప్రధాన భవన సముదాయాన్ని ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్‌లను పటిష్టంగా భద్రపర్చాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల నిర్వహణ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లకు పటిష్టమైన భద్రత కల్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో పి.వెంకటరమణ, ఆర్డీవో రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎస్ఐ ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



వెంకటేష్‌బాబును అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, నగరం జనవరి 4 : రేపల్లె పట్టణ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎస్ఐ ఉద్యోగం సాధించిన ఎం.వెంకటేష్‌బాబును గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. 2013వ బ్యాచ్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన వెంకటేష్‌బాబు ప్రస్తుతం రేపల్లె పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ పోటీ పరీక్షల ఫలితాల్లో సివిల్ ఎస్ఐ గా ఎంపికయ్యాడు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలవటంతో ఆయన అభినందనలు తెలిపారు. నగరం మండలం ఉయ్యూరు వారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రైతు కుటుంబంలో పుట్టిన వెంకటేష్‌బాబు పట్టుదలతో ఎస్ఐగా ఎంపికవటం స్ఫూర్తిదాయకమన్నారు.

## విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలి : డీఈవో

బాపట్ల, జనవరి 4 : జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని డీఈవో పీవీజే రామారావు కోరారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పిచ్చయ్య, సీహెచ్ టీవీ సురేష్, నాయకులు ఎ.వీరాస్వామి, వై.శ్రీకృష్ణ, దండా శ్రీరామకృష్ణ, వై చినకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవారికి వైసీపీ టిక్కెట్టు ఇస్తే గెలిపిస్తాం : గోవతోటి

పిట్టలవానిపాలెం జనవరి 4 : తాను వైసీపీకి వ్యతిరేకం కాదని, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి మరలా టిక్కెట్ ఇస్తే ఓడిపోతారని, కొత్తవారికి టిక్కెట్టు ఇస్తే గెలిపించుకుంటామని వైసీపీ నాయకుడు గోవతోటి విజయ తెలిపారు. స్థానిక జలవనరుల శాఖ గెస్ట్‌హౌస్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని ధిక్కరించి రాజీనామాలు చేస్తామని చెప్పలేదని అన్నారు. ఈ సమావేశంలో డేగల రవిరెడ్డి, కొత్తపాలెం మాజీ సర్పంచ్ దోమా నాగేశ్వరరెడ్డి, మారుబోయన శ్రీనివాసరెడ్డి, సీనియర్ వైసీపీ నాయకులు కె.రాఘవరెడ్డి, అక్కల ఏడుకొండలురెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పి.శివారెడ్డి, పి.కృష్ణారెడ్డి, తుమ్మా కృష్ణమోహనరెడ్డి, పలువురు కార్యకర్తలు, వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

## ఓటు విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

అమృతలూరు, జనవరి 4: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ మెహర్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ప్రతి పౌరుడు విధిగా పాటించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఆర్ఐ ఫణీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదు

● అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ



ఉరితాళ్ళు తగిలించుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రేపల్లె, జనవరి 4: అంగన్‌వాడీలపై ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు అన్నారు. గురువారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక సమ్మె 24వరోజుకు చేరింది. ప్రభుత్వం అందించిన సమ్మె నోటీస్ కాపీలను దహనం చేస్తూ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించేంతరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం సంఘీభావం తెలిపారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మెడకు ఉరితాడు వేసుకుని నిరసన తెలిపారు. 6నుంచి జిల్లా కేంద్రాల్లో నిరవధిక దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఏఐటీయూసీ నాయకులు శ్రీమన్నారాయణ, గోవాడ శ్రీనివాసరావు, రమేష్, కృష్ణ, అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జీ.నాగమల్లేశ్వరమ్మ, కనకదుర్గ, ధనలక్ష్మి, పరమేశ్వరి, గీతారాణి, కీర్తుదానం తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 4 : అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతూ తీసుకువచ్చిన సర్క్యులర్ కాపీలను అంగన్‌వాడీ కార్యకర్త లు తగులబెట్టి తమ నిరసనను తెలియజేశారు. ఈ నెల 5 నుంచి రిలే దీక్షలు, 6 నుంచి జిల్లా కేంద్రాల్లో నిరవధిక దీక్షలు శాంతియుతంగా చేయనున్నట్లు అంగన్‌వాడీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్‌కుమార్, సెక్టార్ లీడర్లు రమాదేవి, సూర్యలక్ష్మి, గృహలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

### జీవో ప్రతులు దహనం

కొల్లూరు, జనవరి 4 : అంగన్‌వాడీ కార్యకర్తలు 5వ తేదీలోగా విధుల్లో చేరాలి లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇచ్చిన జీవో ప్రతులను అంగన్‌వాడీ కార్యకర్తలు దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. గురువారం కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు 24వ రోజున సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కొల్లూరులో కలెక్టర్ జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

## మల్లంఖంబ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కర్లపాలెం, జనవరి 4: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు జాతీయ స్థాయిలో మల్లఖంబ్ పోటీలను మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే పోటీల్లో చింతాయపాలెం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట వెంకటరాజు తెలిపారు. బాలురు అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి మల్ల ఖంబ్ పోటీల్లో కె.జయచంద్రరెడ్డి (8వతరగతి)తృతీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో పి.కార్తీకరెడ్డి (10వతరగతి) తృతీయ బహుమతి, అండర్-17 బాలికల విభాగంలో ఆర్.అనురాధరెడ్డి, ఎం.జాహ్నవి (10వతరగతి) తృతీయ స్థానం, అండర్ -19 బాలికల విభాగంలో పి.జాస్నికా (8వతరగతి) తృతీయ స్థానం పొంది జాతీయ స్థాయి మల్లఖంబ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పద్మకుమారి, నర్రా శ్రీనివాసరావు, పుష్పేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషు, రాఘవేంద్ర, శ్రీనివాసరావు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## వైసీపీ మండల నూతన కమిటీ నియామకం

బాపట్ల, జనవరి 4 : బాపట్ల మండల వైసీపీ నూతన కమిటీని గురువారం ప్రకటించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో కమిటీ వివరాలను రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్ వెల్లడించారు. వైసీపీ మండల అధ్యక్షుడిగా కోకి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా జొన్నలగడ్డ ఇస్సాకు, ఇందేటి నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పిట్టు శ్రీనివాసరెడ్డి, మోర్ల సముద్రాలుగౌడ్, జాష్టి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నామా చక్రపాణి, కార్యదర్శిగా గోసాల కోదండం, ముఖర్జీ, రాగాల చిన కోటేశ్వరరావు, వలిబాబు, నక్కల భూలక్ష్మి, కార్యనిర్వాహక సభ్యుడిగా తుపాకుల డేవిడ్, జంపాని రోశమ్మను నియమించారు. కార్యనిర్వాహక సభ్యుడిగా కొక్కిలిగడ్డ నాగరాజు, విచారపు శ్రీనివాసరావు, రాఘవ, బొనిగల డేవిడ్‌రాజు, అద్దంకి వెంకటేశ్వర్లు, గవిని శ్రీను, కాశీ కిషోర్, అశ్విని, సత్తుల శామ్యూల్, సంషోన్, చేబ్రోలు రామారావు, ఆసోది కృష్ణ, కోట ఉషా రాణి సుబ్బారెడ్డిలను నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిన్నిబోయన ప్రసాద్, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం, నాటుసారా స్వాధీనం

బాపట్ల, జనవరి 4 : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలోని వివేకా విద్యాశ్రమం సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడి చేసి అంగడి శివకృష్ణ వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. బాపట్లలోని 9వ వార్డు చిల్లర గొల్లపాలెంలో పాలపర్తి రమణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో దాడి చేసి పట్టుకొని అతని నుంచి 20 మద్యం బాటిల్స్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

## సూరేపల్లిలో గోవా మద్యం పట్టివేత

భట్టిప్రోలు, జనవరి 4: గోవా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని సెబ్ అధికారులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన అంకమ్మరావు గోవా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు గురువారం దాడి చేయగా ఏడు ఫుల్ బాటిళ్ళ గోవా మద్యం లభించిందని సెబ్ అధికారులు చెప్పారు. మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ అధికారులు పాల్గొన్నారు.

## వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నగరం, జనవరి 4: మండలంలోని జిల్లేపల్లి గ్రామశివారు లో మురుగుకాల్వ పక్కన నాటుసారాకు ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎవరైన నాటుసారా తయారు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జీతాలు ఇవ్వని గ్రామ పంచాయతీ అధికారులు

చుండూరు, జనవరి 4 : ఆలపాడు గ్రామ పంచాయతీ అధికారులు కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని గురువారం సిబ్బంది కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ స్వీపర్‌గా, ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న కూచిపూడి కిరణ్‌బాబు, పి.భాస్కరరావుకు ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో పాటుగా తొమ్మిది నెలలుగా పోస్టు శాంక్షన్ ఆర్డరు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని వీరు డిమాండ్ చేశారు.



అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనగాని

## అంకమ్మతల్లి దేవాలయంలో అనగాని పూజలు

రేపల్లె, జనవరి 4 : మండలంలోని నల్లూరుపాలేనికి చెందిన వీరవల్లి శివరామకృష్ణ గ్రామదేవతకు మొక్కుకోవటంతో ఎమ్మెల్యే అనగాని శివప్రసాద్ అంకమ్మ తల్లి దేవాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, యరగాళ్ళ శ్రీనివాసరావు, దేవగిరి రవి, రావుపాటి శ్రీధర్, రామారావు, రాజేశ్వరరావు, గోవిందమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుంది : బాలాజీ



సభలో మాట్లాడుతున్న సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ

రేపల్లె, జనవరి 4: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. గురువారం తమ డిమాండ్లను అమలు చెయ్యాలని మున్సిపల్ కార్మికులు తమ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన సంఘీభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమం లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.నాగాంజనేయులు, శరంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల దుర్గారావు, సత్యవతి, కుసుమ, సరస్వతి, వసంత, దుర్గ పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భట్టిప్రోలు, జనవరి 4: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా నిరసనను తెలియజేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం ప్లేకార్డులు చేతబూని నిరసనను తెలిపారు. 16 రోజులుగా సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్రశిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కోర్టు తీర్పుననుసరించి సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాల ని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, అకౌంటెంట్, మెసెంజరు పాల్గొన్నారు.

## ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

బాపట్ల, జనవరి 4: వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ బ్రెయిలీ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అంధులకు సన్మానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో గుంజి ఏడుకొండలు, నారాయణ, నాగరాజు, సాంబయ్య, భూదేవి, రాధిక, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అంధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, రామయ్య తదితరులు

● మండలంలోని మూలపాలెంలో జనసేన పార్టీ దివ్యాంగుల నాయ కులు గోగన ఆదిశేషు ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంధుల కోసం లిపి కనిపెట్టి వారి జీ వితాలలో వెలుగులు నింపిన మహనీయులను స్మరించుకుంటూ వేడుకలు జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. అనంతరం అంధులను సన్మానించారు. కార్యక్రమంలో కందుల వెంకటరెడ్డి, ఇమ్మడిశెట్టి మురళీ కృష్ణ, జయప్రకాష్, శాంతి పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 4 : అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహాజ్ఞాని లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా గురువారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని ప్రత్యేక అవసరాల చిన్నారుల శిక్షణకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో దేవరాజ్ మాట్లాడుతూ భవ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రత్యేకావసరాల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య ఉచితంగా ఆపరేషన్లు, వినికిడి యంత్రాలు అందజేస్తుందన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈడీ టీచర్ మేరి ఇవాంజలిన్, కె.రత్నాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## లబ్ధిదారులకు పెంచిన పింఛన్ పంపిణీ

కొల్లూరు, జనవరి 4 : లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు గురువారం పంపిణీ చేశారు. కొల్లూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ ని లబ్ధిదారులకు పెంచిన పింఛన్ నగదును అందజేశారు. కార్యక్రమం లో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, ఈవోపీఆర్‌డీ రవిబాబు, ఏఎంసీ ఛైర్మన్ ఉప్పు శిరీష, జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్ రమావత్ విజయ, కార్యదర్శి బి.మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ పద్మారావు, సనకా వెంకట్రావు, నర్రా వెంకటకృష్ణారావు, ఘంటా రంగారావు, బొల్లిముంత ఏడుకొండలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 4: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆర్థికంగా బలపడేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని రేపల్లె వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ ఛైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్తా, జీ.ప్రశాంత్, సుధాకరచంద్రహాసన్, లియాఖత్ బాషా, బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఆరుతడుల కోసం ఎదురుచూపులు


కారంచేడు ప్రాంతంలో నీరులేక బెట్టకు వస్తున్న వరి పైరు

» నీరులేక బెట్టకు వస్తున్న పైర్లు
» గింజలు తాలుగా మారతాయని రైతుల ఆందోళన

కారంచేడు(పర్చూరు), జనవరి 4: అతివృష్టి, అనావృష్టితో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నిన్నామొన్నటి వరకు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరదలతో నీటి మునిగిన వరి పొలాలు నేడు నీరులేక బెట్టకు వచ్చిన పరిస్థితులు నెలకొన్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నా ఫలితం లేకపోవటంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. కొమ్మమూరు కాలువపైనే ఆధారపడిన రైతులకు ప్రభుత్వ వైఖరి కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. మరోపక్క కొమ్మమూరు కాలవలో నీరు అడుగంటంతో ఏమిచేయాలో పాలుపోనిస్థితిలో రైతులు ఉన్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో మెట్ట పొలాల్లో సాగుచేసుకున్న పంటలు పూర్తిగా నష్టపోయి అవస్థలు పడుతున్న తరుణంలో ఇలా అరాకొరా సాగుచేసుకున్న మాగాణి పంటలను కూడా నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయి.. ఆరుతడులకు నీరు అందించండి అని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. మరోప్రక్క డ్యాంలో నీరులేదని ఆరుతడులకు నీరు అందించలేమని అధికారులు కూడా ప్రకటనలు చేసిన నేపథ్యంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం పైరు పాలదశకు చేరుకుందని, ఆరుతడులు అందించపోతే గింజ తాలుగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో దాదాపు 16వేల ఎకరాల్లో రైతులు వరిని సాగుచేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.50వేల వరకు ఖర్చుచేశారు. పంట చేతికి అందివస్తున్న తరుణంలో ఆరుతడులు అందకపోతే పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పులిచింతల నుంచి ఆరుతడులకు నీరు అందించి ఆదుకోవాలని అన్నదాతలు మొరపెట్టుకుంటున్నారు. ఆదిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి


ఫోన్‌లో సంఘీభావం తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

చినగంజాం, జనవరి 4: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని మండల పరిధిలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో సమగ్ర శిక్ష ఉద్యోగులైన సీఆర్‌ఎంటీలు, కేజీబీవీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఐఈఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని కోరుతూ జేపీసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం సమ్మెలో పాల్గొన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో ఉన్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదని మండల పరిధిలోని సీఆర్‌ఎంటీలు తెలిపారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎంఈవోలు సంఘీభావం తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఉపాధ్యాయుడు ఎస్.నాగమల్లేశ్వరరావుకు ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపి మీ వెన్నంటి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సపొందాలి

అద్దంకిటౌన్, జనవరి 4: కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే అంత ప్రమాదకరం ఏమికాదని హెచ్‌సీజీ కేన్సర్ సెంటర్ వైద్య నిపుణులు డాక్టర్ నారు రమణారెడ్డి అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, హెచ్‌సీజీ ఎంఎన్‌ఆర్ కేన్సర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గీతా మందిర్‌లో ఉచిత కేన్సర్ శిబిరం, అవగాహన సదస్సు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు.

భాస్కర్ సప్లయర్స్ యజమాని గార్లపాటి శ్రీనివాసరావు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ రమణారెడ్డి పలువురిని పరీక్షించి మందులు అందించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారెడ్డిని, దాత గార్లపాటి శ్రీనివాసరావును రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, అద్దంకి లేవిప్రసాద్, డాక్టర్ యు.దేవపాలన, సందిరెడ్డి శ్రీనివా సరావు, నర్రా శ్రీలక్ష్మి, నరసింహరావు, మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి, రామకోటేశ్వరరావు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రాచపూడిలో దొంగతనం

» 15 సవర్ల నగలు, రూ.1.30 లక్షలు నగదు అపహరణ


రాచపూడిలో దొంగతనం జరిగిన ఇంటి యజమాని సాంబయ్యతో మాట్లాడుతున్న కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరి

మేదరమెట్ల, జనవరి 4: ఇంటికి తాళాలు వేసి పొలం వెళ్ళి వచ్చిన గంట వ్యవధిలోనే తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం రాచపూడికి చెందిన రాచపూడి సాంబయ్య 10.30 గంటలకు పొలం వెళ్ళి 11.30 ఇంటికి వచ్చే సరికే తలుపులు పగులగొట్టారు. ఇంటి చుట్టూ నాలుగు సీసీ కెమెరాలు బిగించి ఉన్నాయి. దొంగలు తెలివిగా సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను తీసుకువెళ్లారు. కాంపౌండ్ వాలు దూకి ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి బీరువా తెరిచి అందులో ఉన్న గాజులు, నల్లపూసలు, సుమారు 15 సవర్ల బంగారం, రూ.1.30 లక్షల నగదు తీసుకువెళ్ళారు. రావినూతల బ్యాంక్ లాకర్‌లో బంగారాన్ని సాంబయ్య బుధవారం ఇంటికి తెచ్చాడు. సాంబయ్య భార్య 9.30 గంటలకు పొలం వెళ్లడం, తరువాత సాంబయ్య పొలం వెళ్లడం గమనించి దొంగతనానికి పాల్పడ్డారు. పట్టపగలు దొంగతనం జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

దొంగతనం సమాచారాన్ని కొరిశపాడు స్టేషన్‌కు తెలియపరచడంతో ఎస్ఐ జీవీ చౌదరి సంఘటన స్థలానికి చేరుకొన్నారు. సాంబయ్యతో మాట్లాడి పరిసరాలను పరిశీలించారు. ఇన్‌చార్జ్ సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీచర్ల ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు(విద్య), జనవరి 4: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీచర్ల ఉద్యోగోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రతినిధి బృందం డీఈవో వీఎస్ సుబ్బారావును విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ యూటీఎఫ్ నాయకులు గురువారం ఒంగోలులో డీఈవోను కలిసి మాట్లాడారు.

స్పాట్ వాల్యువేషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, డివిజన్ కేంద్రాల్లో కోర్సులు నిర్వహించి సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చి యాంటిసిడెంట్ రిపోర్టులు ప్రకటించాలని, ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు ప్రారంభించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులతో బదిలీలైన టీచర్ల జీతాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఈబీలో ఎన్నికల బదిలీలపై కసరత్తు

» సిబ్బంది నుంచి ఆప్షన్స్ తీసుకున్న అధికారులు

ఒంగోలు(క్రైం), జనవరి 4: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ ప్రక్రియకు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన ఎస్ఈబీ సిబ్బంది వివరాలను సేకరించారు. గురువారం ఒంగోలులోని పోలీసు కళ్యాణమండపంలో ఈ మేరకు ప్రస్తుతం ఉన్న గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన అధికారులు సమావేశమయ్యారు. నెల్లూరు రీజియన్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నివేదికలు తయారు చేశారు. ఈ ఏడాది జూన్ 30 వరకు పరిగణనలోకి తీసుకొని మూడేళ్లు నిండిన ఎస్సై నుంచి ఆపై అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించారు. అంతేగాకుండా సొంత జిల్లాలో పనిచేసే అధికారులను తప్పనిసరిగా ఇతర జిల్లాకు బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఎస్సైల వరకు డివిజన్ల బదిలీలు ఉంటాయని చెప్పారు.

ప్రస్తుతం ఒంగోలు డివిజన్‌లో పనిచేస్తున్న వారు మార్కాపురం డివిజన్‌కు బదిలీ చేస్తారు. సీఐ, ఆపైస్థాయి అధికారులు అయితే కచ్చితంగా జిల్లా నుంచి తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఆయా అధికారుల నుంచి నాలుగు ప్రాంతాల్లో ఆప్షన్స్ తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి బదిలీల ప్రక్రియ చేపట్టామని ఎస్ఈబీ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎస్ఈబీ ఇన్‌చార్జి జేడీ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, తిరుపతి జేడీ ఎ.రాజేంద్ర, గుంటూరు జేడీ ఎం.వెంకటేశ్వర్లు, బాపట్ల జేడీ పి.మహేష్, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ప్రకాశం ఎస్ఈబీ ఈఎస్ ఎం.సుధీర్‌బాబు పాల్గొన్నారు.

# కార్మికుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

» పదో రోజుకు చేరిన సమ్మె


చీరాల గడియార స్తంభం సెంటర్లో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 4: కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని గత పదిరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండి కార్మికులు జీవితాలతో చెలగాటం ఆడుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ డి మాండ్‌ల సాధన కోసం చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టి ధర్నా కార్యక్రమ శిబిరంలో కార్మికులు గొంతుకు ఉరితాళ్ళు బిగించుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటే శ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, దర్శి వీరయ్య, అలివేలు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### భిక్షాటన చేస్తూ పారిశుధ్య కార్మికుల నిరసన

చీరాల, జనవరి 4: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం పదో రోజుకు చేరింది. భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ని యంత పోకడలతో సమ్మె ను, తమ సంఘటిత శక్తిని అణచివేసేందుకు ప్రయ త్నం చేయటం దుర్మార్గమన్నారు. సీఐటీయూ, ఏటీటీ యూసీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఎందుకు ఇవ్వకూడదో ప్రభుత్వం చెప్పాలన్నారు. సమ్మెకు యూటీఎఫ్ బాధ్యులు ఎస్‌కే జానీబాషా, కుర్రా శ్రీనివాస రావు సంఘీభావం తెలపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు ఎన్.బాబూరావు, బి.సామ్యేలు, ఏ.బాబూరావు, కోటిదాసు, ఎం.అయ్యపరెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘాల బాధ్యులు నూతలపాటి రాజు, డొక్కా మాల్యాద్రి, మేరమ్మ, శంకర్, బడుగు కుమారి, కోటేశ్వరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: ఇంకొల్లు ప్రధాన కూడలిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికుల నిరసనలు చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల జీతాలు వెంటనే అందజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు డిమాండ్ చేశారు. కార్మికులకు ఇడుపులపాడుకు చెందిన హైటెక్ సుభాని మద్దతు తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు.


అద్దంకిలో గొంతుకు ఉరితాళ్ళు బిగించుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

# అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్షపూరిత వైఖరి

» కార్యకర్తలు ధ్వజం
» 25వ రోజుకు చేరిన సమ్మె


చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

చినగంజాం, జనవరి 4: తమపట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మండిపడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తమ న్యాయమైన కోర్కెల కోసం చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగింది. 25 రోజులుగా సమ్మె చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావడంలేదని అంగన్‌వాడీ మండల సంఘం నాయకులు ఎ.హైమావతి, కె.రంగనాయకమ్మ, పి.ఆదిలక్ష్మి, కె.యానాదమ్మ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. తదనంతరం ఆర్ అండ్‌బీ రహదారిపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్, మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నేలపై పడుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

### కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

పర్చూరు, జనవరి 4: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. కార్యక్రమంలో భాగంగా పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైటాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ జీతాలు పెంచి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెకు ఆయా ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి.

అలాగే, కారంచేడు మండలం కొడవలివారిపాలెంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీలు నిరసన గళం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కన్నా రూ.వెయ్యి జీతం పెంచి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు చర్చల పేరుతో సమ్మెను నీరుకార్చే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. అంగన్‌వాడీలు సమ్మెకు టీడీపీ మండల నాయకులు మద్దతు తెలిపారు.

### డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 4: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించ కపోతే ఏ అధికారి ఆదేశాలను అమలు చేయబోమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కలెక్టర్‌లతో కేంద్రాలు తెరవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించే వరకు ఎటువంటి ఆదేశాలను అమలు చేయబోమని తెల్చిచెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టాన ధర్నా కార్యక్రమంలో అంగన్‌వాడీలకు సీఐటీయూ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ కార్యదర్శి ఎం.వసంతరావు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా నేలపై పడుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ ప్రతినిధులు సుజీవన, బ్యూలా, శిరీష మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించ కుండా జరుగుతున్న జగన్మాయకు తెరదించే రోజులు దగ్గర పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బల్లికురవ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు తెలిపారు. గురువారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందన్నారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, శ్రీలలిత, సునంద, నిర్మల, శివపావని, వెంకటరమణ, సరస్వతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన శిబిరాన్ని గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరడం నేరమా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలుగ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# అరాచక పాలనపై తిరుగుబాటు

» 'రా కదలి రా' ను జయప్రదం చేయండి
» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


కనిగిరిలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 4: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, అసమర్థ అరాచక రాజకీయంపై సొంత పార్టీ నేతల అసమ్మతి గళం వినిపిస్తున్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం తీరుపై ఆపార్టీ ఎమ్మెల్యేలు ఆత్మస్థైర్యం కోల్పోయారన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో అరాచకం, దౌర్జన్యం, దోపిడి తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజలంతా జనాసుర పాలన అంతమొందించాలని దీక్షబూనారని ఆయన పేర్కొన్నారు. అరాచక ఉన్మాదపాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌ను నమ్మి మోసపోయామని అయన వెంట నడిచిన ఎమ్మెల్యేలే చెప్పడం ఆయన దుష్టపాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

### ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక..

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్‌బై చెప్తున్నారని ఏలూరి పేర్కొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ ఎమ్మెల్యేలు వైసీపీకి గుడ్‌బై చెప్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని రాజీనామాలు చేస్తున్నారన్నారు. వైసీపీలో చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందో వారికే అర్థంకాని పరిస్థితిలో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఐదేళ్ళు వెనక్కిపోయిందన్నారు. ప్రజల నుండి వస్తున్న నిరసన జ్వాలలకు ఆహుతి కాకముందే పార్టీని వీడి ఇతర పార్టీలోకి పోతున్నారని ఏలూరి అన్నారు.

శుక్రవారం కనిగిరిలో జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అయోధ్య శ్రీరాముని అక్షితలు పంపిణీ

వేటపాలెం(చీరాల), జనవరి 4: మండలంలోని రామన్నపేటలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయంలో భక్తులకు అయోధ్య రాముని అక్షింతలను పండితులు, పురోహితులు, అర్చకులు, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చల్లా రామరావు తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే శ్రీరాముని పూజా కార్యక్రమాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించి పూజాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 500 మంది భక్తులకు అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు, వేటపాలెం జడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, అసోసియేట్ ప్రెసిడెంట్ బండ్ల బాబు, ప్రధానకార్యదర్శి యారాసు అరుణ్‌బాబు, గుత్తి సదాశివరావు, రామలింగం, ఆదిలక్ష్మి, రేణుక, రాధ, ప్రసన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు, జనవరి 4: మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో అయోధ్య రాములవారి అక్షింతలు గ్రామంలోని ప్రధానవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో చింతా రామారావు, చింతా శ్రీధర్‌బాబు, యర్రంరెడ్డి శ్రీనివాసరెడ్డి, చీతిరాల అనంతరామయ్య, మోటుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జయహో బీసీ వర్క్‌షాప్‌నకు తరలివెళ్లిన నేతలు

చీరాల, జనవరి 4: టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ వర్క్‌షాప్‌నకు ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆదేశాల మేరు చీరాల శ్రేణులు తరలివెళ్లారు. వర్క్‌షాప్‌నకు వెళ్లినవారిలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు కౌతవరపు జనార్థనరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నాశిక వీరభద్రయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, కోటి మోహన్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అంగిరేకుల వెంకటేశ్వరరావు, కోసూరి శ్రీనివాస్, అవ్వారు సాంబయ్య, డి. రూపవతి, పి.నాగరాజు, పి.సాయిబాబు తదితరులు ఉన్నారు.

## అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

వేటపాలెం(చీరాల), జనవరి 4: అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని అందిన సమాచారంతో అయోధ్యనగర్‌లో ఎస్సై సురేష్ సిబ్బందితో కలసి నిర్వహించిన దాడులలో 96(క్వార్టర్) సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ నుంచి 80 మద్యం సీసాలు, మరో వ్యక్తి నుంచి 16 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

## వరి పంట కోత, నూర్పిడి ప్రయోగం

వేటపాలెం(చీరాల), జనవరి 4: మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం -2 రైతు భరోసా కేంద్రం పరిధిలో గురువారం ఏవో కాశీవిశ్వనాధ్ పర్యవేక్షణలో వరి పంట కోత, నూర్పిడి ప్రయోగం జరిగింది. నిర్ణీత విస్తీర్ణంలో కోతకు వచ్చిన వరిని కోశారు. ఆతరువాత నూర్పిడిచేసి, కాటా వేశారు. ఈ ఏడాది మాగాణి రైతులకు ఎకరాలకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనావేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్‌ఓ చాముండేశ్వరి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంట్లు అనిల్, గోపి, వీఏఏలు జ్యోతి, సాంబంశివరావు, రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా పొన్నలూరి

అద్దంకిటౌన్, జనవరి 4: తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి బాపట్ల పార్లమెంట్ కన్వీనర్‌గా అద్దంకికి చెందిన పొన్నలూరి కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కన్వీనర్‌గా ఎంపిక చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడుకు, పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు, రాష్ట్ర బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు సాయినాధశర్మకు, బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిం రామ్‌ప్రసాద్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడాపోటీల్లో సత్తా చాటిన ఇంకొల్లు విద్యార్థులు

ఇంకొల్లు, జనవరి 4: ప్రకాశం జిల్లా పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిసెంబరు 30, 31 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలలో ఇంకొల్లు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని 17 జిల్లాల బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో బాపట్ల జిల్లా జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయుడు మధుమూర్తిని ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, ఆదినారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

### కాకానిపాలెం పాఠశాలకు వితరణ

అద్దంకిటౌన్, జనవరి 4: పట్టణంలోని కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత, ఉపాధ్యాయుడు హనుమంతరావు పాఠశాల అవసరాలకు ఉపయోగకరమైన ప్రింటర్, స్కానర్‌ను అందజేశారు. రూ.18 వేలతో ప్రింటర్, స్కానర్‌ను హెచ్‌ఎం గురవయ్యకు అందజేశారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అద్దంకిటౌన్, జనవరి 4: మాల మహానాడు, అద్దంకి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శింగరకొండ ఆశ్రమంలోని వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. యద్దనపూడి సర్పంచ్ వలేరు రేణుకబాలకోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, జ్యోతి పార్థసారధి, నూతలపాటి సురేష్, పోలయ్య, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్లు


పింఛన్లను అందజేస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ, జనవరి 4: గ్రామాలలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పింఛన్లు మంజూరు చేయిస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి తెలిపారు. గురువారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా మంజురయిన 79 మందికి పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంపీడీవో బ్రహ్మయ్య, జడ్పీటీసీ చింతల అంజలి, తహసీల్దార్ రవిబాబు, ఏపీఎం సురేంద్రబాబు, పలుగ్రామాల వైసీపీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ, జనవరి 4: మండలంలోని కొణిదెనలో ఓ ఇంట్లో మద్యం అమ్మకాలు చేస్తుండగా గురువారం ఎస్ఐ వేమన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 9 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అనుమతులు లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమిపిస్తున్నందున గ్రామాలలో ఘర్షణలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పంగులూరు, జనవరి 4: మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. గ్రామస్థులు సమిష్టిగా నిధులు సమీకరించి నిర్మించ తలపెట్టిన ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రెయిలీ జయంతి

పంగులూరు, జనవరి 4: పంగులూరులోని భవిత కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు పలు పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం బాచిన లలితకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మస్తాన్‌వలి, దిలీప్, హేమ, ఐఈఆర్‌డీ ఆర్పీలు పి.యోహాన్, టి.అరుణ, కల్పన పాల్గొన్నారు.

## ఏఎంసీ వైస్ చైర్మన్‌గా ముసలారెడ్డి బాధ్యతల స్వీకరణ

సంతమాగులూరు, జనవరి 4: సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్‌గా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు యిప్పల ముసలారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణ్యం హనిమిరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొని ముసలారెడ్డికి అభినందనలు తెలిపారు.